
# కాలు

హెచ్. జానకీదేవి



సుబ్బారావుకి బయటికి వెళ్ళాలంటే ప్రాణాంతకంగా ఉంటోంది. రాజమండ్రికి చెల్లెలి పెళ్ళి అని వెళ్ళిన వారం రోజులకే జ్వరంలో పడ్డాడు. డాక్టరుచూసి మీ కాలు ఏనుగు కాలుగా మారవచ్చు అని చెప్పి, కాకుండాఉండడానికి కొన్నిమందులు రాసిచ్చాడు. అసలే అందంగా కనపడాలని ప్రయత్నించే సుబ్బారావుకి ఈ మాటల్తో డబ్బాలో పెట్టి మూత పెడుతున్నట్టనిపించింది. అంటే ఫైలేరియా అటాక్ అనగానే హార్ట్ ఎటాక్ వచ్చి పైకి పోతున్నట్టనిపించింది.

డాక్టర్ అన్నట్లుగానే విపరీతంగా చలి జ్వరం రావటము, కాలు సైజు మారడము, కొద్దిరోజుల తరువాత జ్వరం తగ్గినా కాలు సైజు తగ్గకపోవడము, దాంతో సుబ్బారావు పైజమాల్లోకి మారడము సినిమా రీళ్లా జరిగిన సంఘటనలు. దీనితో ఇల్లూ, హోటలు, ఆఫీసు, హోటలు ఇల్లూ తప్ప బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచుకున్నాడు సుబ్బారావు.

*　　*　　*

ఆదివారం కాబట్టి త్వరగా భోంచేసి వచ్చి మంచం మీద పడ్డాడు. తన దురదృష్టానికి చింతిస్తూ బాధపడుతున్న సుబ్బారావుకి ఎవరో తలుపు తడుతున్నట్టనిపించింది. వస్తున్నానంటు లేచి తలుపు తీసిన సుబ్బారావుతో హరీష్ "ఏరా! పగలే అయినా తలుపులు మూసుకున్నావు - ఏ అమ్మాయైనా వచ్చి నీ కలలు పాడు చేస్తుందనా" అని నవ్వుతూ అడిగిన దానికి "ఏమిలేదురా పడుకుందామని. లోపలికి రా" అన్నాడు.

సుబ్బారావు హరీష్ ప్రాణస్నేహితులు. చిన్నప్పట్నుంచి ఒకే చోట పెరిగి ఇద్దరూ ఒకే ఊర్లో ఉద్యోగాలు చేస్తున్నారు. కాకపోతే హరీష్‌కి పెళ్ళైంది. సుబ్బారావుకి కాలేదు. మామూలుగా ప్రతి ఆదివారం హరీష్ వాళ్ళింటికి వెళుతూ వుండేవాడు. కాని బోదకాలు వచ్చినప్పట్నుంచి బయటకి వెళ్ళడమే మానేశాడు. తాత్కాలికంగా ఆలోచనలకు ఆనకట్టకట్టి హరీష్‌తో మాట్లాడుతున్నాడు. రెండు గంటలైన తరువాత హరీష్ వచ్చే ఆదివారం తన మారేజి ఆనివర్సరీ అని, పార్టీకి తప్పకుండా రావాలనిఅడిగినదానికి - "సారీరా! రాలేనుపనుంది"- అన్న మాటలకి లేనికోపంతెచ్చుకుంటూ నిష్ఠూరాలాడి ఎట్లాగైతేనేం తప్పకుండా వస్తాను అని ప్రామిస్ చేయించుకుని వెళ్ళాడు హరీష్.

అప్పట్నుంచి సుబ్బారావుకి తను బోదకాలుతో పార్టీ కెళ్ళినట్లూ అందరూ అయ్యో పాపం అంటున్నట్లు, చిన్న పిల్లలందరూ 'అమ్మా! ఏనుగు కాలులాగా బావుంది కదే' అని వాళ్ళ తల్లులతో అంటున్నట్లు కలలు రాసాగాయి.

ఆదివారం రాకూడదని ఎంత అనుకున్నా వస్తున్నానని భయపెడుతూ ఇంకా పన్నెండు గంటల దూరంలోనే వున్నానని తెలియచేసింది కాలెండర్లో ఆదివారం. హరీష్ వెళ్ళిన ఆరవ రోజు సాయంకాలం ఆరు గంటలకు.

ఆదివారంనాడు అందరి కంటే ముందు హరీష్ వాళ్ళింటికి వెళ్ళి దంపతులకు శుభాకాంక్షలందచేసి, వేసి వున్న కుర్చీలు బల్లల వైపు వెళ్ళి మూలగా వున్న కుర్చీలో కూలవేశాడు శరీరాన్ని, నిట్టూరుస్తూ సుబ్బారావు. ఇంకొద్ది సేపట్లో ఈ ప్రదేశం అంతా నిండుతుంది. అందరూ తన కాలు గురించే చర్చిస్తారేమో? లేకపోతే జాలిగా కాలు వైపు చూస్తారేమో?' వెధవకాలు మొత్తం పోయినా బావుండేది. కుంటివాడుగా ఉండటంకంటే చావటం మేలు. ఇట్లాంటి ఆలోచనలతో మునిగిఉన్న సుబ్బారావుకి ఒక్కొక్కరే రావటం తెలియలేదు. వాళ్ళలో సుబ్బారావుకు తెలిసినవాళ్ళువచ్చి పలకరించినా సమాధానం ఇయ్యలేకపోయాడు.

ఇంతలో ఒక్కసారిగా అందరూ గట్టిగా నవ్వడంతో ఈలోకంలోకి వచ్చాడు. తనమీదే జోక్ వేసినట్టున్నాడు. ఆ మధ్యలో కూర్చొన్న గళ్ళ షర్టతను. ఇంతలో అతనే ఏమిటి అందరూ నవ్వుతున్నారు— ఏమన్నా తప్పుగా మాట్లాడానా క్షమించండి అని సీరియస్‌గా అడిగినదానికి మళ్ళీ అందరు నవ్వారు ఏమీ తప్పు లేదంటూ.

ఛీ! అసలు రాకుండా ఉండాల్సింది. వచ్చి వీళ్ళందరి ముందు కూర్చోకుండా ఉండాల్సింది. అయినా హరీష్‌కి బుద్ధిలేదు. రానని ఎంతచెప్పుకున్నా వినిపించుకోకుండా ప్రామిస్ చేయించుకుని నన్ను నవ్వులపాలు చేశాడు. ఛీ! నాదీ ఒక బ్రతుకే. లాభం లేదు ఇక నేను హుస్సేన్ సాగర్ లోపలో, లేకపోతే రైలు చక్రాలు పట్టాలు మధ్యో చోటు చూసుకోవాలి. అని మధనపడుతున్న సుబ్బారావుని మళ్ళీ ఈ లోకంలోకి తెచ్చాడు గళ్ళషర్టు. ఎప్పుడొచ్చాడో ఏమో తన ఎదురుగా టేబులు అవతల కుర్చీలో కూర్చుని వున్నాడు."నా పేరు మూర్తండీ. నేను హరీష్ కజిన్‌ని. బై దిబై మీ పేరేంటి అని అడిగిన అతని వంక నిర్లిప్తంగా చూస్తూ సుబ్బారావన్నాడు."అరే మీరేనన్న మాట మా వాడి బెస్ట్ ఫ్రెండ్. గ్లాడ్ టు మీట్యూ." అని చేయి చాపాడు మూర్తి. చేయి అందించి మళ్ళీ యధాస్థితిలోకి తెచ్చుకున్నాడు. అంతటితో ఆగక మూర్తి "మీరేమిటి ఏమన్నా మెడిటేషన్ చేస్తారా. మౌనంగా కూర్చున్నారు - లేక మాతో మాట్లాడకూడదా!" అని అడిగిన దానికి మెల్లగా రాని నవ్వు తెచ్చుకుంటూ వచ్చే

> *లోపాలెటువంటివైనా నలుగురిలో నవ్వుతూ. నవ్విస్తూ బ్రతకాలి- ఈసురోమని మనుషులుంటే వాతావరణంజిడ్డుగా బోరుగా మారే ప్రమాదం వుంది.*

ఏమిటో అనుకుని - "ఏం లేదండి ఆఫీసు పనులు కొన్ని మిగిలిపోయాయి. వాటిని ఈ రోజు వెళ్ళి పూర్తిచేస్తే ఎట్లాఉంటుందా. అని ఆలోచిస్తున్నాను" అని అబద్ధమాడాడు. నెలకు నాలుగుసార్లు వస్తుందీ ఆదివారం. అట్లాంటిరోజు ఆఫీసుమాట ఎత్తకూడదండి అట్లా మాట్లాడితే వరసగా నలుగురాడపిల్లలు పుడతారని మా నాన్నగారు చెప్పారండి. మీరు మాట్లాడకండి అన్నాడు మూర్తి సిరియస్‌గా. నవ్వొచ్చింది సుబ్బారావుకి. భలే తమాషాగా మాట్లాడతాడే అని అనుకున్నాడు మనసులో. ఏవో కబుర్లు చెప్పడం మొదలు పెట్టాడు. ఇంట్రస్టెంగ్‌గా వుండడంవల్ల. స్వతః తనూ మంచి వక్త అవడంవల్ల చాలా రోజుల తరువాత హాయిగా తన కాలుసంగతి మరిచిపోయి, మూర్తితో మాటల్లో పడ్డాడు సుబ్బారావు.

కొద్ది సేపైన తరువాత మళ్ళీ ఒక్కసారిగా కాలు జ్ఞాపకం రావడంతో తన బాధ మూర్తితో చెప్పుకున్నాడు. దానికి మూర్తి "అదిగాదు సార్, మీరంతగా ఫీల్ అవ్వాల్సినదేముంది. పోనీ దానివల్ల మీ బాధేమన్నా తక్కువైందా. ఇంకా ఎక్కువవుతుందిగాని. మనం ఏపని చేసినా ఏమాలోచించినా మనం సంతోషంగా కాలం గడపడానికే గాని బాధపడడానికి కాకూడదు. కాదు. మీకు రెండు కాళ్ళు వున్నాయి. అట్లాకాకుండా కాళ్ళే లేనివాళ్ళుగా గుడ్డివాళ్ళుగా కాని లేరు. అసలు కాళ్ళేలేని వారు ఎంతో హాయిగా వున్నారు — వాళ్ళని చూడండి. వాళ్ళేమీ సిగ్గుపడరు. జీవితంలో మన ఇష్టాను గుణంగా కొన్ని జరుగుతాయి. కొన్ని జరగవు. జరగలేదనుకోండి. బాధపడకుండా వాటి కనుగుణంగా మనం మారితే మనకేబాధ వుండదు. మీరు అనుకోలేదు బోదకాలు వస్తుందని. వచ్చింది ఇంకా పెరగకుండా మందులు తీసుకొండి. అంతే-దాని మానాన దాన్ని వదిలివేయండి. రాక ముందెంత ఫ్రీగా మూవ్ అయ్యేవారో అందరితో. ఇప్పుడూ అలాగే వుండండి." అన్న దానికి:

"మాటలు చెప్పడం తేలికే మూర్తిగారు. మీరు నా స్థితిలో వుంటే ఏం చేసేవారు. ఇప్పుడు మీరున్నట్లే అందర్నీ నవ్విస్తూ మీరు నవ్వుతూ వుండేవారా?" అన్న ప్రశ్నకు నవ్వుతూ జవాబివ్వబోతున్న మూర్తికి ఫోనొచ్చింది. ఇటురా అని పిలుస్తున్న హరిష్‌కివస్తున్నాననిచెప్పి'ఎక్స్‌క్యూజ్‌మీ - ఇప్పుడే వచ్చి మీ ప్రశ్నకు సమాధానం ఇస్తాను" అని క్రిందకు వంగి లేచి తీసిన కర్రను చంకక్రింద పెట్టుకొని ఫోను వైపు వెళ్తున్న మూర్తిని చూసి నిశ్చేష్టుడయ్యాడు సుబ్బారావు. కారణం మూర్తికి మోకాలునుంచి లేకపోవడమే. ఫోనులో నవ్వుతూ మాట్లాడుతున్న మూర్తి, మూర్తిని చూస్తూ లేచి నుంచున్నాడు. వెనక్కు తిరిగి వస్తున్న మూర్తిని ఒక్కసారిగా వెళ్ళి కౌగిలించుకున్నాడు. సుబ్బారావు. ఇక జన్మలో సుబ్బారావు తన కాలు గురించి బాధపడడు. దానికి తార్కాణం ఏ పార్టీలోనైనా పారలల్స్ వేసుకొని తన కాలుమీద తనే జోకేసి నవ్విస్తూ ఉండే సుబ్బారావుని. మీరు చూడకపోయినా యిట్టే గుర్తుపట్టవచ్చు. ★




సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది